క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కొత్తకోట ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బన్న (50) శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నాగమణి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశప్ప తదితరులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థికసాయం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీలర్ రఘు, గుండ్ల కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య వర్ధంతి



సంకీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం వద్ద శనివారం తాళపాక అన్నమాచార్య 520 వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సేవా మండలి సభ్యులు భజనలు చేశారు. సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య, శిష్య బృందం సంకీర్తనలు ఆలపిస్తూ అన్నమాచార్య విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

చీరల పంపిణీ

కదిరి టౌన్: పట్టణంలోని 3వ వార్డులోని బండార్‌నగర్, సైదాపురంలోని సుమారు 100 మంది నిరుపేద మహిళలకు రిటైర్డ్ హెచ్ఎం శంకరమ్మ శనివారం చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండారు శివమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మురళి, సింగల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా ఇళ్లు నిర్మించుకోండి



గృహ నిర్మాణ లబ్ధిదారులకు సిమెంట్ కూపన్లు అందిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కొత్తకోట పంచాయతీ పరిధిలోని గృహ నిర్మాణ లబ్ధిదారులకు శనివారం సర్పంచ్ నాగమణి సిమెంట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం తక్కువ ధరతో సిమెంట్, స్టీల్ అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారికి కూడా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశప్ప, హౌసింగ్ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలోని వంటశాల గది ఆధునికీకరణ పనులకు అమడగూరు మండలం పూలకుంటపల్లి గ్రామం కరిమిరెడ్డి పల్లికి చెందిన కోటిరెడ్డి వెంకటశివారెడ్డి, శ్రీదేవి దంపతులు రూ.50 వేలు, అందజేశారు. అన్నదాన కార్యక్రమానికి కదిరికి చెందిన మట్టా చెన్నరాయశెట్టి (మట్టా జువెలర్స్) రూ.10 వేలను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఈఓ సి.రామాంజినేయులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి

తలుపుల: విద్యార్థులు విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ.. క్రమశిక్షణతో చదువుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, వాల్మీకి విద్యా సంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రానికి సమీపంలోని శ్రీసాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్ వార్షికోత్సవాన్ని కరస్పాండెంట్ టి.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు ఆట పాటలు, వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జోనల్ సేవాదల్ ఇన్‌చార్జ్ డిక్ బాబు (కృష్ణారెడ్డి), మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్ పాల్గొన్నారు.

కా'పాడి'తేనే రాబడి

- వేసవిలో పాడిపశువుల సంరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు
- పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్





ఓడీ చెరువు: పాడిపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోంది. గేదెలు, ఆవులకు ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగినా.. తక్షణ వైద్య సాయం అవసరమైతే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు క్షణాల్లో పశువైద్యులు అంబులెన్స్ ద్వారా అక్కడికి చేరుకుని పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత పెరుగుతున్న తరుణంలో పాడి రైతులు జాగ్రత్తలు పాటిస్తే పాడి పశువులను కాపాడుకోవచ్చని మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. చలువ పందిళ్ల కింద పశువులను ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పాడి రైతులకు ఆయన అందించిన సూచనలు మీకోసం..

పశువులకు కొట్టం ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కొట్టంలోకి గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాలి. పరిశుభ్రమైన చల్లని నీరు పశువులకు అందుబాటులో ఉంచుకోవాలి. పచ్చని గడ్డి, ఎండుగడ్డి సమృద్ధిగా అందించాలి. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులకు కారణమయ్యే గోమార్లు, దోమలు, ఈగలను నిర్మూలించాలి. గేదెల పాకలు చల్లగా ఉండేలా చూసుకోవాలి. పశువుల పాక పైకప్పును గడ్డితో కప్పి నీళ్లు చల్లుతూ ఉండాలి. వీలైనంత వరకూ పాక పరిసరాల్లో చల్లటి నీడనిచ్చే కానుగ, బాదం, వేప చెట్లు పెంచుకోవాలి. రోజుకు రెండు మూడు సార్లు పశువులను చల్లటి నీటితో కడగాలి. వేసవిలో ఉదయం పది గంటలలోపు సాయంత్రం ఐదు గంటలపైన మాత్రమే మేత కోసం పశువులను బయటకు తోలాలి. ఎండ వున్న సమయంలో మేతకు బయటకు తోలకూడదు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చమటలు ఎక్కువగా బయటకు రావడం. దాహం అధికంగా పెరగడం. మేత సరిగా మేయకపోవడం, శ్వాస కష్టంగా ఉండటం, ఎదకు సరిగా రాకపోవడం, గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయి.

చికిత్స..

వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. చల్లటి ప్రదేశాల్లో ఉంచి తేలికగా జీర్ణం అయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్రోజ్ సైలైన్ ద్రావణాన్నిరక్తనాళంలోకి విటమిన్ ఏ, డీ సూదిమందులను, విటమిన్ సీ,బీ కాంప్లెక్స్ సూది మందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి.

పచ్చిమేతే రక్షణ

వేసవిలో పశువులకు పచ్చిమేత అందించాలి. పచ్చిగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్చర్) వంటివి వాడాలి. పచ్చగడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంటకుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.

నియోజకవర్గంలో పశువుల వివరాలు..

పుట్టపర్తి నియోజక వర్గంలోని ఓడీ చెరువు మండలంలో 11,942 ఆవులు, 2234 గేదెలు, 76,079 గొర్రెలు ఉన్నాయి. అమడగూరు మండలంలో 7,350 ఆవులు, 640 గేదెలు, 48,000 గొర్రెలు నల్లమాడ మండలంలో 9,786 ఆవులు, 4593 గేదెలు, 1,44,987 గొర్రెలు, పుట్టపర్తి మండలంలో 11,236 ఆవులు, 4,893 గేదెలు, 79,079 గొర్రెలు ఉన్నాయి. కొత్తచెరువు మండలంలో 8,929 ఆవులు, 1,790 గేదెలు, 49,130 గొర్రెలు, బుక్కపట్నం మండలంలో 6,690 ఆవులు, 2,850 గేదెలు, 86,000 గొర్రెలు, మేకలు ఉన్నాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ



మల్లేసు మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బత్తలపల్లి: పోట్లమర్రి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బత్తల మల్లేసు (48) మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నేతలు నివాళులర్పించారు. మల్లేసు వేల్పుమడుగు క్రాస్ వద్దనున్న ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుండేవాడు. ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోట్లమర్రి గ్రామానికి తీసుకువచ్చారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు అర్తనాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, వేల్పుమడుగు దామోదర్‌రెడ్డి, సుధాకరరెడ్డి, వీరారెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతుడికి భార్య నాగేంద్రమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకుడు ఓబులు

తాడిమర్రి: సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు కోరారు. శనివారం స్థానిక మద్దులచెర్వు తాగునీటి సంపు వద్ద సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు చేస్తున్న నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాది మంది ప్రజలకు దాహార్తి తీర్చడానికి అహర్నిశలు కష్టపడుతున్న సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తక్షణమే ఇవ్వాలన్నారు. అలాగే కనీస వేతనం రూ.26 వేలు పెంచడంతో పాటు ప్రతి నెలా జీతాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నడిపి ఓబిలేసు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విరాళమివ్వడం హర్షణీయం



నూతన పార్కును ప్రారంభిస్తున్న తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి

కొత్తచెరువు: పిల్లలు ఆడుకునేందుకు, వ్యాయామం కోసం సొంత డబ్బులతో పార్కును ఏర్పాటు చేయడం హర్షణీయమని తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి, సర్పంచ్ రాధ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కమ్మపాళ్యంలో కొత్తచెరువమ్మ గుడి వద్ద నరసయ్య గారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రూ.3 లక్షల విరాళంతో నూతనంగా నిర్మించిన పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పార్కును నిర్మించడం వల్ల పిల్లలకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో కాకతీయ సేవా సంఘం సభ్యులు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఆర్మీ రవి, వెంగన్న, నాగరాజు పాల్గొన్నారు.

మండెంవారిపల్లిలో 'ఫ్యామిలీ ఫిజీషియన్' సేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

ఎన్పీకుంట: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, వైద్యసేవలు పొందాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్ వర్ధన్ తెలిపారు. మండల పరిధిలోని మండెంవారిపల్లి గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం 57 మందికి వైద్య పరీక్షలు చేసి, గర్భిణులు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు రమేష్‌రెడ్డి, సురేంద్ర, ఏఎన్ఎమ్‌లు రాధాకుమారి, భార్గవి, ఆశా కార్యకర్త ఉష తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక



ప్రాజెక్ట్‌ను చూపుతున్న విద్యార్థి కార్తిక్

ఓడీ చెరువు: మండలంలోని తంగేడుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కార్తిక్ రూపొందించిన ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శంకర్ బాబు, గైడ్ టీచర్స్ మహేంద్రరెడ్డి, మనోహర్ నాయక్ శనివారం తెలిపారు. 2022–23 ఏడాదికి జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు చెప్పారు. ఈనెల 23, 24 తేదీల్లో ఆన్‌లైన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీసత్యసాయి జిల్లా నుంచి 10 ప్రాజెక్టులు ఎంపికైనట్లు వివరించారు. అందులో తంగేడుకుంట పాఠశాల విద్యార్థి కార్తిక్ రూపొందించిన 'మూగవారి సైగలను మాటల రూపంలోకి మార్చేటటువంటి గ్లౌజ్' పరికరం రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ పరికరంలో సైగలకు అనుగుణంగా స్పందించే సెన్సార్లు అమర్చబడి ఉంటాయని, మూగవారి సైగలను ఇది మాటల రూపంలోకి మార్చి వారి అవసరాలను ఇతరులకు తెలియ చేసేలా పని చేస్తుందన్నారు. ఇది మూగవారికి ఎంతో ఉపయోగకరమని గైడ్ టీచర్స్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు కార్తిక్ ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు రమణ నాయక్, శివశంకర్, సధాకర్‌రెడ్డి, ఎల్లప్ప, లక్ష్మీదేవి, జనార్దన్, శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ బాబు హర్షం వ్యక్తం చేశారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఫర్వీన్‌భాను

ఓడీ చెరువు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ ఫర్వీన్‌భాను అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రి ఆవరణలో నూతనంగా రూ. 2 కోట్ల నిధులతో అదనపు భవనాలు నిర్మించేందుకు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. మండలంలోని కొండకమర్లలో మరో ప్రాథమిక వైద్యశాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఐనుద్దీన్‌ఖాన్, డాక్టర్ భానుప్రకాష్ నాయక్ సర్పంచులు గోవిందు, శ్రావణి పాల్గొన్నారు.

పుట్టపర్తిలో భారీ వర్షం



కొత్తచెరువు: మరకుంటపల్లి వద్ద దెబ్బతిన్న మొక్కజొన్న

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పరిసర ప్రాతంలో శనివారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు ఎక్కవగా వీయడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పట్టణంలో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. హనుమాన్, సత్యమ్మ దేవాలయాల్లోకి వర్షపు నీరు చేరింది. 19వ వార్డు ప్రశాంతి గ్రాం వద్ద చెట్టు కొమ్మలు విరిగి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మీద పడటంతో పూర్తిగా దెబ్బతింది. అయితే ఎలాంటి ప్రమాదం జరగలేదు.

దెబ్బతిన్న పంటలు

కొత్తచెరువు: మరకుంటపల్లి, దంట్లపల్లి, బైరాపురం, లోచర్ల ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దంట్లపల్లి సమీపంలో విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. మరకుంటపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పద్మావతమ్మ 14 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పూర్తిగా దెబ్బతింది.

21న మార్కెట్ వేలంపాట

ధర్మవరం: పట్టణంలోని కాయగూరల మార్కెట్‌కు సంబంధించి దిన, వారపు మార్కెట్, జంతువధశాల వేలంపాటను ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దిన, వారపు సుంకాలు వసూలు చేసుకునే వారి గడువు ముగిసిందని ఏప్రిల్ 1వ తేదీ నుంచి వేలంపాట దక్కించుకున్న వారికి మాత్రమే సుంకాలు వసూలు చేసే అనుమతి ఉంటుందన్నారు. 21వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందురోజు సాయంత్రం 5 గంటల్లోపు దిన వారపు మార్కెట్ వేలం కోసం డిపాజిట్ రూ.35 లక్షలు, జంతువధ శాల వేలం కోసం రూ.90 వేలు డిమాండ్ డ్రాఫ్టును కమిషనర్ పేరిట తీసి సమర్పించాలని తెలిపారు. దినవారపు మార్కెట్ వేలానికి సాల్వెన్సీ సర్టిఫికెట్, బ్యాంకు గ్యారెంటీ కింద రూ.40 లక్షలు, జంతువధశాలకు రూ.లక్ష దాఖలు పరచాలని తెలిపారు. వేలంపాటలో అధిక మొత్తంలో పాడిన వారికి ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి 31, 2024 వరకూ సుంకాలు వసూలు చేసుకునే అనుమతి ఉంటుందన్నారు. వేలంపాటలో దక్కించుకున్నవారు అప్పుడే సగభాగం చెల్లించాలని, మిగిలిన డబ్బులు వారంలోపు చెల్లించాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంపాటలో పాల్గొనవచ్చని సూచించారు.

21, 22 తేదీల్లో కబడ్డీ పోటీలు

అమడగూరు: ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని జేకేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే కబడ్డీ పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు హరీష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి క్రీడాకారులకు పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు రూ.500 ఫీజు చెల్లించాలన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. మొదటి బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.8 వేలు, మూడవ బహుమతిగా రూ.5 వేలు, నాల్గవ బహుమతిగా రూ.3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ రాయితీలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణయ్య

కనగానపల్లి: ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలని ఏడీఏ కృష్ణయ్య ఆర్‌బీకే సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రబీ పంటల సాగు, పొలంబడి, వ్యవసాయ రాయితీలపై సిబ్బందితో చర్చించారు. ముఖ్యంగా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీంతో పాటు పీఎం కిసాన్- వైఎస్సార్ రైతు భరోసా పరిహారం అందని రైతులతో ఈ కేవైసీ చేయించాలన్నారు. సమావేశంలో ఏఓ కృష్ణకుమారి, పలువురు వీఏఏలు, వీఎస్ఏలు పాల్గొన్నారు.

అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం రోగులకు దాతలు అన్నదానం చేశారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ హైస్కూల్‌లో 1999–2004 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల ఉపాధ్యాయుడు గోరకాటి పెద్దారెడ్డి, సూర్యనారాయణ పేదలు, ఆసుపత్రిలో రోగులకు అన్నదానం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన బోయ రామకృష్ణ (42) బెంగళూరులో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. వివరాలు.. రాప్తాడుకు చెందిన బోయ రామకృష్ణ, అతని భార్య సుశీల ఈనెల 5న పెనుకొండ నుంచి వస్తుండగా చెన్నేకొత్తపల్లి సమీపంలో జాతీయ రహదారిపై కారు అతివేగంగా వచ్చి వెనుకవైపు నుంచి ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణను 108 వాహనం ద్వారా అనంతపురం, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నేకొత్తపల్లి ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

వారపుసంత వేలం

తనకల్లు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వారపుసంత వేలంపాట రూ.81 వేలు పలికింది. అలాగే పంచాయతీ కాంప్లెక్స్ రెండు రూములు నెలకు రూ.2,200 చొప్పున వేలంపాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి, ఈఓఆర్డీ ఆనందయ్య, కార్యదర్శి కృష్ణమూర్తిరెడ్డి, బేగ్ పాల్గొన్నారు.

25న చేనేత కార్మికుల సమావేశం



కరపత్రాలు విడుదల చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

ధర్మవరం: చేనేత కార్మికుల విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు జింకా చలపతి తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25వ తేదీన చేనేత పరిశ్రమ, కార్మికుల సమస్యలపై నిర్వహించే విస్తృత సమావేశానికి చేనేత కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు వెంకటస్వామి, వెంకటనారాయణ, రమణ, ఆదినారాయణ, శ్రీధర్, శ్రీనివాసులు, బాలరంగయ్య, రామాంజినేయులు, మంజునాథ్, వీరనారప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.